క్లుప్తంగా

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


గీసిన చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు.వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో విజ్ఞానం,సృజనాత్మకత మరింత పెరుగుతాయని ఆమె తెలిపారు.కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన


బాలికలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హేమంత్

సబ్బవరం: మండలంలోని నారపాడు సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలతో పలు రకాల ఆరోగ్య సమస్యలపై చర్చించారు. రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, సచివాలయ ఏఎన్‌ఎం విజయతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాద్రిని సందర్శించిన డీసీ సుజాత


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీ సుజాత

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రిని దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత మంగళవారం సందర్శించారు. వెంకటాద్రిపైకి నిర్మిస్తున్న రెండో ఘాట్‌రోడ్డు పనులతో పాటు అన్నప్రసాద సత్రాన్ని పరిశీలించారు. అలాగే పంచవటి పేరిట నిర్మించిన గెస్ట్ హౌస్‌ను ఇటీవల వెంకటాద్రి పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భవనాన్ని డీసీ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్, అర్చకుడు ఎం.వి.ఆర్.చార్యులు, దేవస్థానం ఈవో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


విద్యార్థులతో కథలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి నరసింహం

సింహాచలం: ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలని అడవివరం శాఖా గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో కథలు చదివించారు.ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ కథలు చదవడం, వినడం ద్వారా జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాది కె.రామకృష్ణ, వీఎంఆర్‌డీఏ ఉద్యోగి లక్ష్మీనారాయణ, కె.మురళి, ఏవీఎస్.భాను, పాఠకులు మోహన్, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

135 మందికి ఉచిత కంటి వైద్యసేవలు

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సత్యసాయి భజనమండలి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా సత్యసాయి మందిరంలో నిర్వహించిన శిబిరంలో 135 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరం అవుతాయని ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 7997958341, 9912440606
సాక్షి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- రూ.87.95 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


నాయకులతో కలిసి అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. జీవీఎంసీ 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో రూ.87.95 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మరెక్కడా లేనివిధంగా ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. అభివృద్ధి పనులకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్య నాయుడు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు, టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాసరావు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, మైత్రీనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి.ఎస్.నరసింహం, షిప్‌యార్డు లేవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, ఆయా కాలనీల అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

చేపట్టనున్న పనుల వివరాలు

- రూ.14లక్షలతో షిప్‌యార్డ్‌లో లేఅవుట్ పార్కు ఏరియాలో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.15.30లక్షలతో మైత్రీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.19.95లక్షలతో పద్మావతినగర్‌లో రిటైనింగ్ వాల్ ఏర్పాటు
- రూ.19.90లక్షలతో సాయిమాధవనగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూ.18.80లక్షలతో అప్పన్నపాలెం, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, పైడిమాంబ కాలనీలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణం.

పథకాలు వివరించి.. సమస్యలు తెలుసుకొని


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. వెన్నలపాలెం శివారు గొల్లపేట, హనుమాన్ కాలనీల్లో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అటువంటి వ్యక్తిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, ఎంపీటీసీ వెన్నల అరుణకుమారి, జేసీఎస్ మండల కన్వీనరు వెన్నల సన్యాసిరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజేయ్‌రాజ్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కొత్తమ్మ ఉత్సవాలు ప్రారంభం

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం, గ్రామదేవత కొత్తమ్మవారి నెల రోజుల పండగ మంగళవారం ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా కొత్తమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం మొదటి మంగళవారం భూలోకమాత అమ్మవారి పండగ వైభవంగా చేపట్టారు. తొలుత అమ్మవారి వీధిలో గల పెద్దింటి నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, బిందుల నృత్యాల మధ్య అమ్మవారి తిరువీధి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారిని కాగడాల వెలుగులో అమ్మవారివీధి, కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ల మీదుగా గోకుల్ థియేటర్ ఊరేగించారు. అక్కడ భూలోకమాత అమ్మవారికి పూజలు నిర్వహించి పండగ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీలాపు రమణారెడ్డి, నీలాపు విజయానందరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉత్సవంలో మహిళల కోలాటం

మీ అమ్మాయిలను కాపాడుకోండి

దాబాగార్డెన్స్: ది కేరళ స్టోరీ సినిమా చూసి, మీ అమ్మాయిలను లవ్ జిహాద్ బారి నుంచి కాపాడుకోవాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు పిలుపునిచ్చారు. కేరళలో ప్రేమ పేరిట వేలాది మంది హిందూ, క్రిస్టియన్ అమ్మాయిలను పథకం ప్రకారం ముస్లింలుగా మత మార్పిడి చేస్తున్నారని అన్నారు. వివాహం చేసుకుని ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న ఐసిస్ ఉగ్రవాద శిక్షణ స్థావరాలకు తరలిస్తున్నారని అన్నారు. అక్కడ లైంగిక కోరికలు తీర్చే బానిసలుగా దుర్భర జీవితంలోని యువతులను నెట్టేస్తున్నారని తెలిపారు. ది కేరళ స్టోరీ సినిమా ద్వారా ఇదంతా అవగతం అవుతుందన్నారు. ఈ సినిమా కేవలం కలెక్షన్ల కోసమో, హిందూ, ముస్లిం సమస్యగానో భావించవద్దని, మానవత్వానికి-ఉగ్రవాదానికి మధ్య జరుగుతున్న వాస్తవ ప్రయత్నంగానే భావించాలని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

11న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 11న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్ల వితరణ

దాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమ హ్యుమానిటేరియన్ సంస్థ కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లను సమకూర్చాయి. వాటిని హిమ హ్యుమానిటేరియన్ చైర్మన్ బీఎన్ మూర్తి, సింహాద్రి టీఎంటీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు కేజీహెచ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ 32 ఏళ్లుగా హిమ హ్యుమానిటేరియన్, సింహాద్రి టీఎంటీ కేజీహెచ్‌కు అందజేస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ పైల సన్నిబాబు, ఏఆర్ఎంవో డాక్టర్ అరుణదేవి, డాక్టర్ జగదీష్, మీసాల రామకృష్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సులోచన, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, పల్లా ఆనంద్, కేవీ వేంకటేశ్వరరావు, హిమ హ్యుమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ పాల్గొన్నారు.


కేజీహెచ్‌కు బీపీ ఆపరేటర్లు అందజేస్తున్న సింహాద్రి టీఎంటీ, హిమ హ్యుమానిటేరియన్ సంస్థ ప్రతినిధులు

రెండు రైళ్లు ఆలస్యం

తాటిచెట్లపాలెం : షాలిమార్‌లో మే 9న మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై (12841) కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది. 9న చెన్నై సెంట్రల్‌లో రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 7.15కు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – హౌరా(12840) మెయిల్ మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 10.05గంటలకు బయల్దేరుతుంది. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు ఇవి చేరుకోనున్నాయి. ఈ రెండు రైళ్లు ఆలస్యంగా చేరుకున్న కారణంగా ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

విశేషంగా అభిషేకాలు


సుబ్రహ్మణ్య స్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

విభాగానికి ప్రింటర్ బహూకరణ



విభాగాధిపతి టి.షారోన్‌రాజుకు ప్రింటర్ బహూకరిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు విభాగానికి నూతన ప్రింటర్‌ను బహూకరించారు. తాము చదువుకున్న విభాగానికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులు నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేసి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజుకు అందజేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్. ప్రకాశరావు, ఆలీ, రాము, ప్రవీణ దేవి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరారు. మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో శ్రీనివాసరావును కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. సెయిల్‌లో వేతన ఒప్పందం జరిగి ఏడాదిన్నర అవుతున్నా ఇక్కడ అమలు కావడం లేదన్నారు. కార్మికుల వేతన సవరణపై డీపీఈ గైడ్‌లైన్స్ అడ్డంకి అంటూ చెబుతుండటం అన్యాయమన్నారు. గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ భాగస్వామిగా గెలిచిన వెంటనే వేతన సవరణ చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. దీనిపై శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు కార్మికులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ కుదేలు


817వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మిక కుటుంబాలు

కూర్మన్నపాలెం : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీ కరిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 817వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆర్ఎంహెచ్‌పీ విభాగం కార్మికులు కుటుంబాలతో సహా పాల్గొన్నా రు. ప్రాణ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీనవర్గాలు,పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతుందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు.

ఘనంగా రోళ్ల పైడిమాంబ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లి గ్రామదేవత రోళ్ల పైడిమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ ఎ. ఎర్రయ్య, కె.సంతోష్, నాయకులు దువ్వి అప్పారావు, బొట్టా నూక అప్పలరాజు, ఎ. అప్పలరాజు, రోమాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం పరిశీలన

97వవార్డు పరిధి గిరిప్రసాద్ నగర్‌లోని ద్రోణంరాజు కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, నాయకులు సన్ని, రాంబరాబు, మూర్తి, రఘు, దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామదేవతల పండగలు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామ దేవత శ్రీమర్లమాంబ పండగను మంగళవా రం వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి దర్శించుకున్నారు. ఆయన వెంట బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు తదితరు లు పాల్గొన్నారు.

- రాయపుర అగ్రహారంలో కొలువైనపరదేశిమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి అమ్మ వారి అనుపు మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆలయం వద్ద సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మరింత వేగంగా సమస్యల పరిష్కారం


ముఖ్యమంత్రి సందేశం వింటున్న ఎంపీడీవో రమేష్ నాయుడు


ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు

సబ్బవరం: ప్రజా సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కంటే ఎంతో మెరుగైనదని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగితో పాటు ప్రభుత్వ శాఖలను బాధ్యులను చేయడం జరుగుతుందన్నారు. సహాయక అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ పారదర్శకంగా కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రణాళికా బద్ధంగా రూపకల్పన చేశారన్నారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వల్ల లబ్ధిపొందలేకపోతున్నవారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలకు పథకాలు చేరవేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం నుంచి అదేరకమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ మహేష్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీదేవితో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహాచలం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని పెందుర్తి తహసీల్దారు కార్యాలయంలో పలువురు అధికారులు వీక్షించారు. ట్రైనీ కలెక్టర్ కీర్తి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో వెంకటరావు, పెందుర్తి లా అండ్ ఆర్డర్ ఎస్ఐ సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని వినతి


అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: రావాడ, తానాం, భర్నికం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లకు సంబంధించిన స్థల సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అదీప్ రాజ్, జెడ్పీటీసీ సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంధుల ఫెడరేషన్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గొర్లివానిపాలెం రేషన్ డిపో విభజన, రావాడ రెవెన్యూలో కలిసి ఉన్న ప్రభుత్వ, ఫారెస్టు భూములు 600 ఎకరాలపై జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని విభజించి ప్రజోపయోగాలకు వినియోగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం, పి.బోనంగి సర్పంచ్‌లు పెదిశెట్టి పూజాశేఖర్, బండారు కల్పనరాజశేఖర్ ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ యాంటీ లార్వా ఆపరేషన్, తడి-పొడి చెత్తను వేరు గా అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చునని అవగాహన కలిగించారు. ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాతటైర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, బిరడా లేని సీసాలు ఉంచరాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, నాగభూషణం, పరమానందయ్య, విశ్వేశ్వరరావు, ఇజ్రాయిల్, గోవిందరావు, ఆదారి శ్రీనివాస్, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com